# కరెంట్ అఫైర్స్

**1.** 2018, జనవరి 1న ఏ రెండు దేశాలు ఆయా దేశాల్లోని అణుకేంద్రాలు, వాటికి సంబంధించిన సమాచారాన్ని పరస్పరం మార్పిడి చేసుకున్నాయి? (ఈ రెండు దేశాల్లోని అణుకేంద్రాలపై పరస్పర దాడుల నిషేధ ఒప్పందం 1988, డిసెంబరు 31న జరగ్గా, 1991, జనవరి 27 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి ఏడాదీ జనవరి 1న అణుకేంద్రాలు, సంబంధిత అంశాల సమాచారాన్ని మార్చుకుంటారు.)

ఎ) ఉత్తర కొరియా – దక్షిణ కొరియా బి) ఇజ్రాయెల్ – పాలస్తీనా

సి) ఇరాన్ – ఇరాక్ డి) భారత్ – పాకిస్థాన్

**2.** దేశ ప్రజలకు ఇచ్చిన నూతన సంవత్సర సందేశంలో 'అణ్వాయుధాలు ప్రయోగించే మీట ఎల్లప్పుడూ నా టేబుల్‌పైనే ఉంటుంది' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యక్తి ఎవరు?

ఎ) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బి) ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్

సి) ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహనీ డి) దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌జెఇన్

**3.** భారత్, మొజాంబిక్‌లలో లభ్యమయ్యే బొగ్గు నుంచి మిథనాల్ తయారీకి ఉన్న అవకాశాలపై అధ్యయనానికి కేంద్ర ఉక్కుశాఖ ఎవరి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది? (ఇది 60 రోజుల్లోపు నివేదిక అందించాల్సి ఉంటుంది).

ఎ) నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె. సారస్వత్ బి) విశాఖ ఉక్కు సీఎండీ పి. మధుసూధన్

సి) పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్ డి) రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ

**4.** ప్రకృతి సేద్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (2017, డిసెంబరు 31 నుంచి తొమ్మిది రోజులపాటు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు.)

ఎ) రాజేంద్రసింగ్ బి) సుభాష్ పాలేకర్

సి) బిందేశ్వర్ పాఠక్ డి) ఎం.ఎస్. స్వామినాథన్

**5.** 29వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని 2018, జనవరి 1న విజయవాడ స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరితో కలసి ప్రారంభించారు? (మాతృభాషను కాపాడుకునేందుకు 2018 ని 'తెలుగు భాష పరిరక్షణ' సంవత్సరంగా ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు.)

ఎ) నరేంద్ర మోదీ బి) ఎం. వెంకయ్యనాయుడు

సి) రామ్‌నాథ్ కోవింద్ డి) సుష్మా స్వరాజ్

**6.** ప్రతిష్ఠాత్మక దేశవాళీ క్రికెట్ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీని 2018, జనవరి 1న ఏ జట్టు నెగ్గింది? (ఇండోర్‌లో జరిగిన ఫైనల్లో 9 వికెట్ల తేడాతో ఏడుసార్లు రంజీ ఛాంపియన్ దిల్లీపై ఘనవిజయం సాధించింది. ఆ జట్టు ఈ ట్రోఫీ గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ జట్టు కెప్టెన్‌గా ఫైజ్ ఫజల్ వ్యవహరించాడు.)

ఎ) బరోడా బి) బెంగాల్ సి) ఝార్ఖండ్ డి) విదర్భ

**7.** 78వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను (నుమాయిష్ – 2018) 2018, జనవరి 1న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఎవరు ప్రారంభించారు?

ఎ) తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ

బి) తెలంగాణ ఆర్థికమంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్

సి) తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి

డి) పై ముగ్గురూ


www.eenadupratibha.net

**8.** ఏ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లాలోని మట్లి అనే గ్రామంలో ఐటీబీపీ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలసి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2017, డిసెంబరు 31న నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు? (చైనాకు సరిహద్దున ఉన్న నెలాంగ్ లోయలో 11,700 అడుగుల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతుంటాయి. ఇక్కడ పర్యటించిన తొలి హోంమంత్రిగా రాజ్‌నాథ్ వార్తల్లో నిలిచారు)

ఎ) జమ్మూ కశ్మీర్ బి) హిమాచల్ ప్రదేశ్ సి) సిక్కిం డి) ఉత్తరాఖండ్

**9.** ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా ఎం. మాలకొండయ్య మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏ రోజున బాధ్యతలు తీసుకున్నారు? (ఎన్. సాంబశివరావు స్థానంలో ఈయన బాధ్యతలు స్వీకరించారు.)

ఎ) 2017, డిసెంబరు 30 బి) 2017, డిసెంబరు 31

సి) 2018, జనవరి 1 డి) 2018, జనవరి 2

**10.** ఆకర్షణీయ నగరాల కార్యక్రమం కింద 60 నగరాలకు విడుదల చేసిన రూ. 9,860 కోట్లలో ఎంత శాతం మేర మాత్రమే ఖర్చయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది?

ఎ) 7% బి) 17% సి) 27% డి) 37%

**11.** ఇటీవల ఏ ఐఐటీలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ 2017లో ప్రపంచంలోనే మొదటి పౌరసత్వం పొందిన రోబో 'సోఫియా' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది? (సోఫియా తొలిసారిగా మన దేశానికి వచ్చింది. అత్యాధునిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సును ఉపయోగించి హాంకాంగ్‌లోని హన్సన్ రోబోటిక్స్ లిమిటెడ్ సంస్థ తయారు చేసిన సోఫియాకు సౌదీ అరేబియా పౌరసత్వం ప్రసాదించింది).

ఎ) ఐఐటీ మద్రాస్ బి) ఐఐటీ ఖరగ్‌పూర్ సి) ఐఐటీ బాంబే డి) ఐఐటీ కాన్పూర్

**12.** తెలంగాణలో 2016తో పోలిస్తే 2017లో నేరాలు ఎంత శాతం పెరిగినట్లు డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి వెల్లడించారు?

ఎ) 10.93% బి) 12.93% సి) 14.93% డి) 16.93%

**13.** అధికార పత్రాలను సభలో ప్రవేశపెట్టేటప్పుడు 'అర్థిస్తున్నా' (ఐ బెగ్) అనే పదాన్ని వాడొద్దంటూ ఇటీవల ఎవరు కేంద్ర మంత్రులకు సూచించారు?

ఎ) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బి) లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్

సి) రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు డి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**14.** దివ్యాంగులను సాధారణ వ్యక్తులు వివాహం చేసుకుంటే ప్రస్తుతం ఇస్తున్న రూ. 50 వేల ప్రోత్సాహకాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎంతకు పెంచింది?

ఎ) రూ. 75 వేలు బి) రూ. లక్ష సి) రూ. 1.5 లక్షలు డి) రూ. 2 లక్షలు

**15.** తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2018, జనవరి 2న ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు? (ఛైర్మన్‌తో పాటు అయిదుగురు సభ్యులుగా నియమితులయ్యారు)

ఎ) బోయిళ్ల విద్యాసాగర్ బి) చిలకమర్రి నర్సింహం సి) ఎర్రోళ్ల శ్రీనివాస్ డి) సుంకపాక దేవయ్య

**16.** ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను అనివార్య కారణాల వల్ల రద్దు చేసిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇస్కా) తిరిగి వాటిని 2018 మార్చిలో ఏ నగరంలో నిర్వహించాలని నిర్ణయించింది?

ఎ) ఇంఫాల్ బి) ఇటానగర్ సి) కోహిమా డి) గువహటి

**17.** ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న గూగుల్ ఎక్స్ తొలిసారిగా అమెరికా వెలుపల భారత్‌లోని ఏ నగరంలో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది? (విప్లవాత్మక పరిజ్ఞానాలను అందుబాటులోకి తేవాలనే ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ పరిశోధనలు చేస్తుంటుంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రాజెక్ట్ లూన్, ప్రాజెక్ట్ మకాని, ప్రాజెక్ట్ వింగ్, ప్రాజెక్ట్ ఫాగ్‌హార్న్ పేరిట పలు పరిశోధనలు చేపట్టింది.)

ఎ) ముంబయి బి) బెంగళూరు సి) విశాఖపట్నం డి) హైదరాబాద్

**18.** 2016తో పోలిస్తే 2017లో ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు ఎంత శాతం పెరిగినట్లు 2017 వార్షిక నేరగణాంక నివేదిక వెల్లడించింది?

ఎ) 12.73% బి) 16.73% సి) 20.73% డి) 24.73%

**19.** 2017, డిసెంబరు 25న దేశంలోనే తొలి ఏసీ సబర్బన్ రైలును ఏ నగరంలోని బొరివిలి – చర్చిగేట్ స్టేషన్ల మధ్య ప్రారంభించారు?

ఎ) దిల్లీ బి) బెంగళూరు సి) చెన్నై డి) ముంబయి

**20.** 15 ఏళ్ల తర్వాత రాజ్యసభలో ఏ రోజున ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలు అడిగే అవకాశం దక్కింది? (చివరిసారి 2002లో జరిగిన 197వ సమావేశంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలను సభలో ప్రస్తావించే అవకాశం దక్కింది. అప్పట్లో ప్రశ్నలు వేసిన 20 మందిలో 10 మంది హాజరుకాకపోవడంతో అది సాధ్యమైంది. కానీ తాజాగా సభలో కొందరు సభ్యులు హాజరు కాకపోయినా వారి స్థానంలో మరికొందరికి అవకాశం కల్పించి మొత్తం 18 మందితో మాట్లాడించారు.)

ఎ) 2018, జనవరి 1 బి) 2018, జనవరి 2

సి) 2018, జనవరి 3 డి) 2018, జనవరి 4

**జవాబులు**

**1–డి; 2–బి; 3–ఎ; 4–బి; 5–బి; 6–డి; 7–డి; 8–డి; 9–బి; 10–ఎ; 11–సి; 12–బి; 13–సి; 14–బి; 15–సి; 16–ఎ; 17–సి; 18–డి; 19–డి; 20–బి.**

## వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్

- తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాన్ని 2017, డిసెంబరు 31 అర్ధరాత్రి 12 : 01 గంటలకు ప్రారంభించారు.
- 2014, జూన్ 2న తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు. 2018, జనవరి 1 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 యూనిట్లు.
- వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతోపాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేశాయి. 514 కొత్త సబ్‌స్టేషన్లు, 1724 కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,514 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించాయి.
- ఆర్థిక ప్రగతికి సూచికగా పేర్కొనే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1200 యూనిట్లు. నేడు 1505 కు పెరిగింది.
- తెలంగాణ విద్యుత్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ మంత్రి జి. జగదీష్ రెడ్డి. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు.

## అయిదో విడత 'జన్మభూమి - మా ఊరు'

- 5వ విడత 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో 2018, జనవరి 2న ప్రారంభించారు. జనవరి 11 వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది.
- జన్మభూమి కార్యక్రమాన్ని గతంలో కంటే భిన్నంగా రోజుకో అంశం చొప్పున 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.
- మొదటి రోజు సంక్షేమం – సంతృప్తి, రెండో రోజు ఆరోగ్యం – ఆనందం, మూడో రోజు స్వచ్ఛాంధ్ర ప్రదేశ్, నాలుగో రోజు విద్య – వికాసం, అయిదో రోజు మౌలిక సదుపాయాలు, ఆరో రోజు సహజ వనరులు – అభివృద్ధి, ఏడో రోజు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి, ఎనిమిదో రోజు సుపరిపాలన – టెక్నాలజీ వినియోగం, తొమ్మిదో రోజు విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ – పేదరికంపై గెలుపు అనే అంశాల పేరిట 'జన్మభూమి – మా ఊరు'ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమం చివరి రోజు జనవరి 11న 'ఆనంద లహరి'ని నిర్వహించాలని నిర్ణయించింది.

- ఈ ఏడాది ఉగాది నుంచి పెళ్లికానుక పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. ఎస్టీలకు రూ. 50 వేలు, ఎస్సీలకు రూ. 40 వేలు, బీసీలకు రూ. 30 వేలు చొప్పున పెళ్లి సమయంలో వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. 2018లో రాష్ట్రంలో లక్ష పెళ్లిళ్లకు సాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.
- పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రూ. 1617 కోట్లతో ఉపకార వేతనాలు అందిస్తున్నామని, కొత్తగా 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు అందిస్తున్నామని, 19 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని సీఎం తన ప్రసంగంలో వెల్లడించారు.
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల వర్చువల్ తరగతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు.

## భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే

- భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే నియమితులయ్యారు. 2018, జనవరి 28న పదవీ విరమణ పొందనున్న ఎస్. జై శంకర్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు. 2017లో భారత్ – చైనా నడుమ డోక్లామ్‌లో 73 రోజులపాటు చోటు చేసుకున్న సైనిక ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించిన విజయ్ ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు.

## హిమాచల్‌ప్రదేశ్ 14వ ముఖ్యమంత్రిగా జైరాం ఠాకూర్

- జైరాం ఠాకూర్ హిమాచల్‌ప్రదేశ్ 14వ ముఖ్యమంత్రిగా 2017, డిసెంబరు 27న ప్రమాణ స్వీకారం చేశారు. సిమ్లాలోని ప్రసిద్ధ రిడ్జ్ మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ తొలుత ముఖ్యమంత్రితో, ఆ తర్వాత 11 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net